కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఇఒ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

డిఇఒ కె.వాసుదేవరావు కలెక్టర్ క్యాంపు కార్యాలంయలో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీ లతను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. తొలుత ఆయన కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. త్వరలో జరిగే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆయనకు సూచించారు. వాసుదేవరావు విజయనగరం జిల్లాలో డివైఇఒగా పనిచేవారు. బదిలీపై జిల్లాకు వచ్చారు.



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న డిఇఒ

బిజెపితో అంటకాగేవారిని సాగనంపండి

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, చాగల్లు

బిజెపితో అంటకాగేవారిని రానున్న ఎన్నికల్లో సాగనంపాలని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల ప్రజలకు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రచ్చబండను నిర్వహించారు. అలాగే కాకినాడ జిల్లా తునిలో రోడ్‌షోలో ఆమె పాల్గొన్నారు. చాగల్లులో జరిగిన రచ్చబండలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దళితుల సమస్యలు, చాగల్లు షుగర్‌ఫ్యాక్టరీ మూత వల్ల ఉపాధి కోల్పోయిన వారి సమస్యలను పలువురు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని పలువురు వాపోయారు. దళిత మహిళ హోం మంత్రిగా ఉన్నారని, ఆమె నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేకుండా పోయిందని దళిత నాయకుడు బొంత శ్యామ్‌ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రవాణారంగ కుదేలైందని ఆ రంగ కార్మికులు ఆమె వద్ద సమస్యలను ఏకరువు పెట్టారు.

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి షర్మిల మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఇద్దరు బిజెపికి తొత్తులుగా ఉన్నారన్నారు. వారి స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను బిజెపి వద్ద తాకట్టు పెనట్టారన్నారు. బిజెపితో పొత్తు కోసం ఇరుపార్టీలు తహతహలాడుతున్నాయన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి పక్షాన చేరే వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, వైసిపిలకు ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్టేనన్నారు.కొవ్వూరు ఎంఎల్ఎ తానేటి వనతి హోం మంత్రిగా ఉండి కూడా దళితులపై దాడులను ఆపలేకపోతున్నారన్నారు. వైసిపి నాయకుల అన్యాయాలను ప్రశ్నించిన వారిపై దాడులు పెరిగాయన్నారు. హత్యలకూ వారు వెనకాడట్లేదన్నారు. ధరలను అదుపుచేయడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో పావలా ఇచ్చి రూపాయి లాక్కుంటున్నారన్నారు. కుటుంబంలో ప్రతి బిడ్డకూ అమ్మ ఒడి అని చెప్పి ఒక బిడ్డకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం రూ.13 వేలు ఇస్తుందన్నారు. సర్కారు కల్తీ మద్యంతో సామాన్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. ఆర్‌బికెలున్నా రైతులకు మాత్రం భరోసా లేకుండా పోయిందన్నారు. టిడిపి హయాంలో 7 వేల పోస్టులతో డిఎస్‌సి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. ఆ సమయంలో బాబు హేళన చేసిన జగన్, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో చేసిందేమిటి? అని ప్రశ్నించారు. దగా డిఎస్‌సితో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. చాగల్లులో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పి, ఐదేళ్లయినా నేటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదు జగనన్నా? అని ప్రశ్నించారు. వైఎస్‌ఆర్ వారసులు అంటే హామీలు ఇచ్చి మోసం చేయడమా? అని అన్నారు. ఇసుక, మద్యం, భూ కుంభకోణాల ద్వారా సంపాదించిన డబ్బును రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వం విచ్చలవిడిగా పంచనుందన్నారు. డబ్బులు తీసుకున్నా... ఓటు మాత్రం ఆలోచించి వేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు కల్పన, పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీ ద్వారానే వస్తాయనేది గుర్తు చేసుకోవాలన్నారు. మోసపూరిత ప్రలోభాలకు లొంగకుండా రాష్ట్ర భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటువేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి సంతకం ప్రత్యేకహోదా ఫైలుపైనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జెడి.శీలం, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, సుంకర పద్మశ్రీ, ఎ.అరుణకుమారి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చాగల్లులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న షర్మిల

దివీస్‌ను ఏ బంగాళాఖాతంలో కలిపారు?

దివీస్ పరిశ్రమను జగన్మోహన్‌రెడ్డి బంగాళాఖాతంలో కలుపుతానన్నారని, ప్రతిపక్షంలో ఉండగా ఉద్యమాలు చేసి ముఖ్యమంత్రి అయ్యాక ఆ పరిశ్రమకు దగ్గరుండి మరీ అనుమతులిచ్చారని విమర్శించారు. దివీస్‌ను ఏ బంగాళాఖాతంలో కలిపారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. తుని రోడ్‌షోలో పాల్గొన్న షర్మిల స్థానిక మంత్రి దాడిశెట్టి రాజాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇసుకవ్యాపారంలో, గుట్కా వ్యాపారాలు చేస్తూ రాజా జేబులు నింపుకుటున్నారన్నారు. బయట మద్యాన్ని తెచ్చి రెట్టింపు రేట్లకు అమ్ముకుంటున్నారన్నారు. ఆయన పేరు దాడిశెట్టి రాజా కాదు అనుభవించు రాజా అంట కదా? అంటూ ఎద్దేవా చేశారు. బాబు అమరావతి పేర 3డి సినిమా చూపిస్తే జగన్ మూడు రాజధానుల పేర కాలయాపన చేశారన్నారు. చివరికి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బెజెపితో బాబు, జగన్‌లు దోస్తీ కడుతున్నారన్నారు. కేంద్రం నుంచి రూ.10 లక్షల కోట్లు రావాల్సి ఉందని, దీనిపై ఎంత నిధులు వచ్చాయో ప్రభుత్వ చెప్పాలని డిమాండ్ చేశారు.



ప్రధాన వేదిక ఏర్పాట్లను చేస్తున్న నిర్వాహకులు

నేడు గోదావరి బాలోత్సవం

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పిల్లల పండుగ గోదావరి బాలోత్సవం శనివారం ప్రారంభం కానుంది. గతేడాది నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో అదే స్ఫూర్తితో ఈ ఏడాది 2వ పిల్లల పండుగకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. చిన్నారుల్లో సృజనాత్మకత, మానసిక, శారీరక ఉల్లాసం పెంపొందించడమే లక్ష్యంగా రెండు రోజుల పాటు ఈ బాలోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ఈ వేడుకలకు వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో సుమారు ఆరు వేల మందికిపైగా చిన్నారులు ఇప్పటికే పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మరో నాలుగు వేల మందితో మొత్తంగా 10 వేల మంది చిన్నారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది.

షెడ్యూల్ ఇలా....

ఉదయం 10 గంటలకు బాలోత్సవం ప్రారంభం కానుంది. సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల పోటీలు జరుగుతాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నారు. 3.30 గంటలకు ఈ సభ ప్రారంభం కానుంది.

32 అంశాలలో సుమారు 60 పోటీలు

32 అంశాల్లో సుమారు 60 సాంస్కృతిక, విద్య, విజ్ఞాన విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సబ్ జూనియర్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. మట్టి బొమ్మల తయారీ, కార్టూన్‌లు గీయడం, దినపత్రిక చదవడం, అంతర్జాలంలో అన్వేషణ, పద్యం –భావం క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, కోలాటం, జానపద నృత్యం, సంప్రదాయ నృత్యం, చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, తెలుగులో మాట్లాడటం, కథలు చెప్పడం, జ్ఞాపక శక్తి పరీక్ష తదితర అంశాల్లో పోటీలు జరగనున్నాయి.

వేడుకలా గోదావరి బాలోత్సవం

గోదావరి బాలోత్సవం వేడుకలా నిర్వహించనున్నాము. నగరంలోని దాతల సహకారంతో పిల్లలకు పూర్తి స్థాయిలో ఉచితంగా 2వ పిల్లల పండుగ నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోదావరి బాలోత్సవం ఆహ్వాన సంఘం చైర్‌పర్సన్, కలెక్టర్ కె.మాధవీలత హాజరు కానున్నారు. తల్లిదండ్రులు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరై విజయవతం చేయాలని కోరుతున్నాం.

- పి.తులసి, ఆర్గనైజింగ్ కార్యదర్శి

వెట్టి చాకిరికి పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వెట్టి చాకిరికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి హెచ్చరించారు. శుక్రవారం వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుమారి మాట్లాడారు. మాట్లాడుతూ భారత రాజ్యాంగం 23వ అధికరణ ప్రకారం మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీని నిషిద్ధం అన్నారు. 'వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం, 1976లోని కీలక అంశాలను ఆమె వివరించారు. మనుషులను స్వచ్ఛందంగా కాకుండా బలవంతంగా, మోసపూరితంగా, బెదిరింపులతో పని చేయించుకోవడం, ఆ పనికి తగినంత వేతనం ఇవ్వకపోవడం, వారిని నిర్బంధంలో ఉంచి స్వేచ్ఛకు భంగం కలిగించడం నేరమని పేర్కొన్నారు. ఇలాంటి వాటిపై పోలీసులే కేసు నమోదు చేసి విచారించే అధికారం ఉంటుందని తెలిపారు. అనంతరం పుష్కర ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించారు, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బిఎస్ఎం.వలీ, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ జి.స్వాతి, మైన్స్ అండ్ జియోలాజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఇంటర్నేషనల్



జస్టిస్ మిషన్ హెడ్ ప్రోగ్రాం పార్టనర్‌షిప్ మేనేజర్ ఎం.జేసుదాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే భవిష్యత్తు

జెవివి కళాజాతాలో వక్తలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సైన్సుతోనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా జెవివి ఆధ్వర్యంలో రాజమహేంద్రి మహిళా కళాశాలలో శుక్రవారం కళాజాతా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ టికె.విశ్వేశ్వరరెడ్డి ఈ జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు సైన్స్‌ను నమ్మి, నిరంతరం సైన్సును అధ్యయనం చేస్తూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. స్వశక్తితో అందరూ గొప్ప వ్యక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతా కెప్టెన్ జి.మురళీధర్ మాట్లాడారు. కులమత భేదాలను వదిలి సర్వ మానవ సమానత్వాన్ని పాటించాలన్నారు. ప్రపంచాన్ని నడిపిస్తున్న సైన్సుతో మరింత విజ్ఞానాన్ని పొందాలన్నారు. భూమిని పరిరక్షించుకోవాలని, ప్రకృతిని కాపాడుకోవాలని పేర్కొన్నారు. జెవివి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు నేషనల్ సైంటిఫిక్ టెంపర్ జాతా గురించి వివరించారు. రాజ్యాంగ లక్ష్యాలలో ఒకటైన సైంటిఫిక్ టెంపర్‌ను అందరూ అలవర్చుకోవాలన్నారు. శాస్త్రీయంగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పైడియ్య మాట్లాడుతూ విద్యారంగానికి కేటాయింపులు పెంచాలని, వైజ్ఞానికరంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. నగర అధ్యక్షులు ఎన్.రవిబాబు జెవివి కార్యక్రమాలను వివరించారు. జెవివిలో సభ్యులుగా చేరి ప్రజలను చైతన్యవంతంగా చేయడంలో భాగస్వాములవ్వాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ చైతన్య శేఖర్ మాట్లాడుతూ ఎంత అభివద్ధి చెందుతున్నా నేటికీ సమాజంలో ఇంకా మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయని, వాటికి ఎంతోమంది బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు కోసం యువత ముందుకు రావాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్య సౌందర్య కళాకారులకు స్వాగతం పలికారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు, మ్యాజిక్ షో ఆకట్టుకున్నాయి. మెజీషియన్ శ్రీరాములు మ్యాజిక్ ట్రిక్స్ లోని సైన్స్ రహస్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు తాతారావు, జార్జ్ ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు నాయకులు కె.రమేష్‌బాబు, జివి.అప్పారావు పాల్గొన్నారు. జెవివి నాయకుడు చోరగుడి నిశ్చల్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



నిర్బంధాలపై ఆశాల నిరసన

తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

అక్రమ అరెస్టులు, నిర్బంధాలపై ఆశావర్కర్లు నిరసన తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వారు విధులను బహిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. **రాజమమేంద్రవరం** సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ 'చలో విజయవాడ' కార్యక్రమానికి ఒకరోజు ముందే సచివాలయ మహిళా పోలీసుల ద్వారా ఆశా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారన్నారు. అర్ధరాత్రి 11 గంటల వరకు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, రాజకీయ, అధికార వేధింపులు ఆపాలిన డిమాండ్లతో శాంతియుత ఆందోళనకు దిగామన్నారు. దీనికి కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనుమతించడం లేదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మహిళలని కూడా చూడకుండా మెన్ ఫోర్స్ ద్వారా నిర్బంధాన్ని ప్రయోగించారన్నారు. మహిళా సాధికారత అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. కరోనా సమయంలో రాష్ట్ర ప్రజానీకానికి ప్రాణాలకు తెగించి సేవలు చేసినందుకు జగన్ ప్రభుత్వం పోలీసులతో చేసిన సత్కారానికి రాబోయే ఎన్నికల్లో రుణం తీర్చుకుంటామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఆదిరెడ్డి శ్రీనివాస్ ధర్నాకు మద్దతు తెలిపారు. ఆశాలపై నిర్బందాన్ని తీవ్రంగా ఖండించారు. అలాగే ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు దుర్గ, హవేలా మంగ, సత్య, కమల, సునీత, జయ, రమలక్ష్మి, సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు. **కడియంలో** తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశాలు ధర్నా నిర్వహించారు. తెలుగు దేవిచౌక్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు టి.నాగమణి, సెక్రటరీ పి.పద్మ, జాయింట్ సెక్రటరీ వి.లక్ష్మి, ఎస్.ముత్యవేణి, డి సత్యవతి తదితరులు పాల్గొన్నారు **దేవరపల్లి** మండలం యాదవోలు పిహెచ్‌సి వద్ద ఆశాలు ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడారు. ఆశ వర్కర్ల పట్ల దుర్మార్గ వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయటం అవివేకం అన్నారు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బుజ్జమ్మ, టి.భారతి, ఎ.ద్రాక్షాయణి, టి.సరోజిని, పి.ఝాన్సీ పాల్గొన్నారు. **చాగల్లు** పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు ర్నా నిర్వహించారు. వి.కస్తూరి, టి.లక్ష్మి, జె.లక్ష్మీదుర్గ, ఎ.మంగతాయారు తదితరులు పాల్గొన్నారు. **పెరవలి** మండలం కానూరు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశా కార్యకర్తలు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. యూనియన్ గౌర అధ్యక్షులు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలో. ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ.ద్వారక, ఎ.సుమతి, కె.బేబి, దుర్గాభవాని, ఆశాలు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు



కడియంలో...



దేవరపల్లిలో..

కార్టూ'నిజం'



అరెస్టు కాకుండా ఆయనకి కేంద్రం నుంచి భరోసా ఉంది.. మనకేదీ.? భరోసా..!!

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం


జాతీయ డీవార్మింగ్ డేను పురస్కరించుకుని జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణా మాత్రలను పంపిణీ చేశారు. **చాగల్లు** మండలం బ్రాహ్మణగూడెం పిహెచ్‌సి పరిధిలో 2,706 మంది పిల్లలకు గాను 2,652 మందికి ఆల్బెండాజోల్ మాత్రలే వేశామని వైద్యాధికారి డాక్టర కె.నిశిత, వైద్యులు పిఆర్ఎల్.దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలో 7,847 మంది విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు మిగించామని పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.ప్రసాద్ తెలిపారు. 8,079 మంది విద్యార్థులకు గాను 7,847 మందికి మాత్రలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం. సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గోపాలపురంలో** వైద్యులు స్వర్ణలత, జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డీవార్మింగ్ డేను నిర్వహించారు. హుకుంపేట పిహెచ్‌సి పరిధిలోని 8319 మంది పిల్లలకు గాను 8,151 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అన్నదేవరపేట పిహెచ్ సి పరిధిలోని 5,398 మందికి 5,295 పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. **గోకవరం** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో డీవార్మింగ్‌డేను నిర్వహించారు. గోకవరం ప్రభుత్వ హై సూల్లో డాక్టర్ అలేఖ్య ఆధ్వర్యంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు, దాసరి చినబాబు, వరసాల ప్రసాద్, మాజీ ఎంపిటిసి పులపర్తి బుజ్జి విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. వైసిపి నాయకులు మందపాటి సతీష్ కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **సీతానగరం** పువ్వాడ సత్యమాంభ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆల్బంద్రోజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, తహశీల్దార్ రెహ్మాన్, ఎంపిడిఒ కృష్ణపసాద్ పాల్గొన్నారు.



సీతానగరంలో...



గోకవరంలో...



గోపాలపురంలో మాత్రలు వేస్తున్న వైద్యులు

పీవీకి భారతరత్న పట్ల హర్షం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, కడియం

మాజీ ప్రధాని పివి.నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కలగ శ్రీవెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం మండల అధ్యక్షులు జ్యోసుల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, దోనేపూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కడియంలోని బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల బాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీగిరజాల కృష్ణారావు కళావేదికలో ఆనందోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్, మాజీ ప్రధాని పివి నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తాము బాధ్యతా సేవా సంస్థ తరపున పుష్కర కాలంగా కోరుతున్నామని గిరజాల అన్నారు. ఇన్నాళ్లకు తమ కల నెరవేరిందన్నారు. అలాగే ఎన్‌టిఆర్‌కు కూడా భారతరత్న ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కడియం శివాలయం కమిటీ చైర్మన్ ఆర్ఎస్ఎన్.మూర్తి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు చిక్కాల శ్రీనివాసరావు, కుసునూరు బాబులు, పిండి నాగరాజు, పూడి బ్రహ్మం, మందపల్లి త్రిమూర్తులు, కడియం గణేష్, గుడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కడియంలో హర్షం వ్యక్తం చేస్తున్న బాబు తదితరులు

నేరాలు ఘోరాలు


గోడ మధ్యలో ఇరుక్కుని మృతి చెందిన శివ సుబ్రహ్మణ్యం

గోడ మధ్యలో ఇరుక్కుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని స్థానిక సుబ్రమణ్య భారతి వీధిలో పశువుల ఆసుపత్రి సమీపంలో గురువారం రాత్రి ఒక వ్యక్తి తన స్వగహం గోడ మధ్యలో ఇరుక్కుని దుర్మరణం చెందాడు. శుక్రవారం ఉదయం ఇంటి పక్కన ఉన్న స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శేరు నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం..సుబ్రహ్మణ్య భారతి వీధిలో ఉన్న గీదా శివ సుబ్రహ్మణ్యం (38) మద్యం సేవించి తన ఇంటి పైన గోడపై రోజూ పడుకునేవాడు. గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో పడుకున్న శివ జారి తన ఇంటి గోడ పక్కింటి గోడ మధ్యలో ఇరుక్కుపోయి మరణించాడు.

సచివాలయ ఉద్యోగులపై దాడి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక జగ్గయ్య చెరువులో 11వ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాంప్రసాద్, మహిళా కానిస్టేబుల్ సంధ్యారాణిపై ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి దాడి చేశారు. సచివాలయంలో ఇళ్ళ పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ సమస్యలు తలెత్తిసర్వర్ నెమ్మదిగా ఉండడంతో రిజిస్ట్రేషన్ కోసం సచివాలయం దగ్గర ఎక్కువ సమయం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జగ్గయ్యచెరువు ప్రాంతానికి చెందిన భవాని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాంప్రసాద్‌పై కోపోద్రేకానికి గురైంది. అక్కడే ఉన్న మహిళా కానిస్టేబుల్ సంధ్యారాణి మందలించే ప్రయత్నం చేస్తే ఆమె పైన దూషణకు దిగింది. ఇంతలో ఆమె సోదరుడు తేజ వచ్చి సచివాలయ ఉద్యోగి రాంప్రసాద్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగి గాయాలయ్యాయి. దీంతో సచివాలయ ఉద్యోగులు తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మురళీమోహన్ తెలిపారు.


రోడ్డుపై ఏర్పడిన గోతులు

రోడ్డుపై గోతులతో ఇబ్బందులు

ప్రజాశక్తి - చాగల్లు

పంగిడి- నిడదవోలు రోడ్డులో చాగల్లులో ప్రాంతంలో గోతులు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. సిమెంట్ రోడ్డు తారు రోడ్డు మధ్య జాయింట్ వద్ద గోతులు ఏర్పడ్డాయి. రాత్రి సమయాంలో ద్విచక్ర వాహదారులు గోతచుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలదీ ఇదే పరిస్థితి. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని కోరుతున్నారు. అలాగే మెయిన్ బజార్లో బస్టాండ్ వద్ద రోడ్డుపై రాళ్లు పైకితేలాయి వాహనాలు వేగంగా వెళ్తున్న సమయంలో రాళ్లు చెదిరి రోడ్డు పక్కన ఉన్న షాపులు, బాటసారుపై పడుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ బి.హేమకుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో భాగంగా వీరవంకపల్లి, పెంటపల్లి, రంపఎర్రంపాలెం, గంగంపాలెం, తిరుమలాయపాలెం, మల్లవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది శ్రీరాములు, విఆర్ఒ చంద్రకాంత, విఆర్ఎ ప్రసన్నకుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


రాంజీతో వైసిపి నాయకులు, కార్యర్తలు

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొత్తపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపికి చెందిన సుమారు 40 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం తనయుడు తోట రాంజీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంజీ మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను సిఎంగా, నరసింహాన్ని ఎంఎల్‌గా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయం కన్వీనర్ దంగేటి వెంకటరత్నం, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ బుజ్జికి సన్మానం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ఎంపిడిఒ నాతి బుజ్జిని ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మట్టా వీరస్వామి ఆధ్వర్యంలో ఎంపిడిఒ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరం

కార్మిక సంఘాల సమావేశంలో నేతలు

16న బంద్ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ

మోడీ విధానాలు దేశ ప్రజానికానికి ప్రమాదమని కార్మిక సంఘాల సమావేశంలో పలువురు నేతలు అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతుకూలీ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంధు, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కె.జోజి, టిఎన్‌టియుసి నాయకులు యఱ్రమోతు. ధర్మరాజు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాళ్లుగా మారాయన్నారు. ఐదేళ్లలో 3 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. మోడీ తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లు పరిశ్రమల్లో సంపద సృష్టించే కార్మికులను ఏ హక్కులులేని బానిసలుగా మార్చాయన్నారు. కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో 23 లక్షల పోస్టులు ఖాళీ ఉండికూడా దేశంలో యువత ఉద్యోగాలులేక నిరుద్యోగ భారత్‌గా వెలిగిపోతుందని విమర్శించారు. ప్రతిరోజు దేశంలో మహిళలపై అత్యాచారాలు నిత్యకృత్యాలుగా మారాయన్నారు. దళితులను, గిరిజనులను, మైనారిటీలను రెండవ తరగతి పౌరులుగా మార్చేందుకు నిత్యం బిజెపి ఐటి సెల్, మోడీ భజనచేసే మీడియాలో విషప్రచారం జరుగుతోందన్నారు. 90 శాతం వ్యవసాయ భూముల్లో కౌలు రైతులు అర్థ బానిసలుగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ప్రకటించే రైతు పథకాలు ఏవీ కౌలు రైతులకు అందట్లేదన్నారు. జిఎస్‌టి వల్ల ధరలు పెరుగుతున్నాయని, నిత్యవసరాలు సామాన్యులకు అందుబాటులో లేని కారణంగా పౌష్టికాహారం లోపంచి ఆకలి చావులు పెరిగాయన్నారు. ఎన్నడూ లేనంతగా దేశంలో పేదరికం పెరిగిందని, వీటిని పరిష్కరించలేక మోడీ రాముడి వెనుకాల దాక్కొంటూ, భావోద్వేగాలను ముందుకు తెస్తున్నారని తెలిపారు. ప్రజలు, రైతులు , పరిశ్రమల్లోని కార్మికులు, వ్యవసాయ కార్మికులు 16న బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. తక్షణం రైతు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు పంట నష్టం, ఇన్సూరెన్స్ కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వేతనం 600 చెల్లించాలని, అందుకు బడ్జెట్లో రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వి.కొండలరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి జెపివిలో పాల సేకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జెసి

జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో మార్చి 1 నుంచి పాల సేకరణ ప్రారంభమవుతుదని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. శనివారం నుంచి గ్రామ స్థాయిలో ఇంటింటా సర్వే నిర్వహించి పాడి రైతులు, లబ్దిదారుల గుర్తింపు చేపట్టాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం హుకుంపేట గ్రామ సచివాలయం-1లో పాలసేకరణపై వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న పాల సేకరణపై జిల్లా, డివిజన్, మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. తదుపరి ప్రక్రియ కోసం గ్రామ స్థాయి, సచివాలయ పరిధిలో చేపట్టాల్సిన సర్వేపై క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. జెపివి ద్వారా సేకరించిన పాలకు వెన్న శాతం, చిక్కదనం ఆధారంగా ధర చెల్లింపులు చేస్తారన్నారు. జిల్లాలో చేయూత, ఆసరా కింద ప్రయోజనం కలిగిన పాడి రైతులను గుర్తించి, వారి వివరాలూ జెపివి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జగనన్న పాల వెల్లువ కేంద్రానికి గ్రామ సచివాలయం ఉన్న పాడి రైతుల ద్వారా పాల సేకరణ చేపట్టాల్సి ఉంటుందన్నారు. పాడి రైతులకు ఎనిమిది అంకెలతో కూడిన డిజిటల్ నెంబర్ ఇస్తారన్నారు. మార్చి 1 నుంచి పాల సేకరణ ప్రక్రియను ప్రారంభిస్తారని, ఆలోగా వాలంటీర్లు సేకరించిన డేటా ఎంట్రీలను డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు, మండల వెటర్నరీ డాక్టర్ సౌమ్య, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బియ్యం స్టాక్ వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతన్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

ప్రభుత్వ నిర్దేశాల ప్రకారం జిల్లాలోని ట్రేడర్స్, హోల్ సెల్లర్స్, రిటైలర్స్, బిగ్ చైన్ రిటైలర్స్, ప్రోసెసర్లు, మిల్లరు అందరూ వారి వద్ద ఉన్న బియ్యం, ధాన్యం స్టాక్ వివరాలను సంబంధిత పోర్టల్‌లో వారం రోజుల్లోగా నమోదు చేయాలని జెసి ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ మేరకు ట్రేడర్లు, వ్యాపారులు, మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు జిల్లాలో ఉన్న ధాన్యం, బియ్యం యొక్క స్టాక్ వివరాలు నిర్దేశిత పోర్టల్ (http://evegoils.nic. in/rice/login.html)లో ఏడు రోజుల్లోగో తప్పక నమోదు చేయలన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించాల్సి ఉంటుందన్నారు. ఇకపై ప్రతి శుక్రవారం నిరంతరం నమోదును కొనసాగించాలన్నారు. ఈ మార్గదర్శకాలపై అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహించామన్నారు. మండల పరిధిలో ఉన్న సిఎస్‌డిటిలు, వారి పరిధిలో ఉన్న వ్యాపారులు, హోల్ సేల్, రిటైలర్స్ మిల్లర్లు సంబంధిత డేటా ఎంట్రీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పకుండా స్టాక్ వివరాలు, బోర్డ్ ప్రదర్శించాలన్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు సంధర్భంగా మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేసేలా అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.విజయ భాస్కర్, బియ్యం అమ్మకందారులు, రైసు మిల్లర్ల ప్రతినిధులు సిహెచ్.బ్రహ్మాజీ, ఎబిఎన్.ప్రసాద్, కె.సుబ్రహ్మణ్యం, వి.శివకృష్ణ, సిహెచ్.సుబ్బారావు, ఎన్.బుల్లిమోహన్‌రెడ్డి, దొరయ్య, చిన్ని కృష్ణ, పౌర సరఫరాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆదిరెడ్డి తదితరులు

కష్టాల్లో ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఆవాసం, వారి ఆరోగ్యాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని టిడిపి కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. భవాని ఛారిటబుల్ ట్రస్టు, వాసవి శ్రీ మల్టీ స్పెషాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన మెగా ఉచిత వైద్య శిబరం శుక్రవారం 36వ డివిజన్ వాంబే గృహాల వద్ద జరిగింది. ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తంగెళ్ల బాబి ఈ శిబిరాన్ని ప్రారంచారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని వాంబే గహాల వద్ద ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. పేదలు నివసించే నివాసాల వద్ద డ్రెయినేజీలు బాగు చేయాలని, తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. రాళ్లు అంటించి... రంగులు వేస్తున్నారని, వైసిపి నాయకులు దీన్నే అభివృద్ధి అంటున్నారన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బంగారు నాగేశ్వరరావు, లచ్చిరెడ్డి వాసు, సలాది ఆనంద్, కొల్లి బుజ్జి, వేణ, తుల్లి పద్మ, కె.శ్యామల, నాగల్మి పాల్గొన్నారు.

మసీదు ముసుగులో టిడిపి నాయకుల భూకబ్జా

వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ మహ్మద్ ఆరిఫ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


ముస్లిములు, గ్రామపెద్దలతో మాట్లాడుతున్న ఆరిఫ్

మసీదు నిర్మాణం పేరుతో రూ.కోట్లు విలువ చేసే వక్ఫ్ బోర్డ్ భూమిని కబ్జా చేసేందుకు టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని, ఈ కుట్రలను చట్టపరంగా అడ్డుకుంటామని వక్ఫ్ బోర్డ్ జిల్లా చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ హెచ్చరించారు. కడియం మండలంలోని పొట్టిలంకలో మసీదు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారంటూ టిడిపి, జనసేన నాయకులు ఇటీవల ఆరోపణలు చేశారు. ఈ మేరకు నిజనిర్ధారణ చేసేందుకు వక్ఫ్ బోర్డ్ చైర్మన్, డైరెక్టర్లు సర్పంచ్ వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలతో కలిసి వాస్తవ స్థితిని పరిశీలించారు. గ్రామంలో ఉన్న రెండు గ్రూపులతో వేర్వేరుగా మాట్లాడి పలు వాస్తవాలను నిర్ధారించారు గ్రామంలో 40 ఏళ్ల క్రితం నుంచి మసీదు ఉందని, దానిని 15 ఏళ్ల క్రితం స్లాబు నిర్మించి పక్కా మసీదుగా మార్చుకున్నారన్నారు. ఎనిమిదేళ్లుగా ఈ మసీదులో ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు కూడా అందుతున్నాయన్నారు. గ్రామంలోని పలు ముస్లిం కుటుంబాలు పాత మసీదు కమిటీకి మధ్య విబేధాలు ఉన్నాయన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేసినా టిడిపి నాయకులు వాటిని అడ్డుకుంటూ వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. భూమిని స్వాహా చేసేందుకు టిడిపి మైనారిటీ నాయకులు పన్నిన పన్నాగం బయటపడిందన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామ సెక్రటరీ నిర్మాణాన్ని ఆపేయాలని నోటీసులు ఇచ్చారన్నారు. ఆయనపైనా అసత్యమైన నిందారోపణలు చేస్తున్నారని వాటిపై కూడా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ముస్లిముల ఆస్తులకు రక్షణ కల్పించాలని లేనిపక్షంలో ఎంఎల్‌ఎ బుచ్చయ్య చౌదరి ఇంటిని సైతం ముట్టడించేందుకు వెనకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్లు షట్టర్ భాష, మహ్మద్ జఫరుల్లా ఖాన్, పఠాన్ రహీం ఖాన్, సయ్యద్ రబ్బానీ, షేక్ ఇబ్రహీం, షేక్ జిలాని, షేక్ అహ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షఫీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

న్యాయ సంహిత చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

దేశంలో అతిపెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగాన్ని పూర్తిగా దెబ్బతీసి కార్పొరేట్లకు ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేష బాబ్జి అధ్యక్షతన సుందరయ్య భవన్‌లో వివిధ ట్రాన్స్‌పోర్ట్ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేష బాబ్జి మాట్లాడుతూ 1988లో మోటారు వాహన చట్టం తీసుకొచ్చారని తెలిపారు. ఆ చట్టాన్ని ఎటువంటి సమీక్ష చేయకుండానే 2019లో మోటారు వాహన సవరణ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. రోడ్ సేఫ్టీ పేరుతో, ప్రమాదాల నివారణ పేరుతో రవాణా రంగ డ్రైవర్లకు సంవత్సరాల తరబడి శిక్షలు, రూ.లక్షల జరిమానాలు ఈ చట్టంలో ఉన్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా ఆ చట్టం నిలిచిపోయిందన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం భారత న్యాయ సంహిత చట్టం పేరుతో మరోసారి రవాణా రంగ కార్మికులపై దాడి మొదలు పెట్టిందన్నారు. దీనివల్ల డ్రైవర్లకు 10 ఏళ్లకు పైగా జైలు శిక్ష, రూ.పది లక్షల పైగా జరిమానా విధిస్తారన్నారు. ప్రభుత్వ అసలు ఉద్దేశం ప్రమాదాలను నివారించడం కాదని రవాణా రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా అన్ని రంగాల వాహనాల డ్రైవర్లు, యజమానులు ఏకమై ఫిబ్రవరి 16న దేశవ్యాప్త ట్రాన్స్‌పోర్ట్ బంద్‌కు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో పలు యూనియన్ల నాయకులు నాయకులు బి.సత్యనారాయణ, ఎస్.చంద్రశేఖర్, తాతపూడి మూర్తి, ఎంవి రమణ, కె.సత్తిబాబు, లోవరాజు, గుండుబోగుల శ్రీనివాస్, వై.వీరభద్రరావు, కె.శ్రీనివాసరావు, కె.సాయిరాం, రాజ్‌కుమార్, సిహెచ్.రాంబాబు పి.రాజబాబు, ఎం.రామకృష్ణ, విఎల్.నారాయణ, సిఐటియు నాయకులు పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా పాల్గొన్నారు.

యానాం నూతన ఎస్‌పిగా రాజశేఖరన్

ప్రజాశక్తి - యానాం

యానాం నూతన ఎస్‌పిగా రాజశేఖరన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్‌పిగా పని చేసిన రఘునాయగం బదిలీపై పుదుచ్చేరి వెళ్లడంతో ఆయన స్థానంలో రాజశేఖరన్ బాధ్యతలు చేపట్టారు. సిఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, ఇతర పోలీస్ సిబ్బంది రాజశేఖరన్‌ను కలిసి అభినందించారు.